నాగేంద్ర అది తీసుకుని ఆఫీసరు దగ్గరకు వెళ్ళాడు. అతడిముందే అది చింపి పారేసి బయటకు వచ్చాడు. మళ్ళీ అతడా ఆఫీసు మొఖం చూడలేదు.

రెండునెలల తర్వాత మరో ప్రైవేటు కంపెనీలో చేరాడు. అక్కడంతా యూనియన్ వాళ్ళదే రాజ్యం. ఒక వ్యక్తి దొంగతనం చేస్తూ పట్టుబడినా యూనియన్ అతణ్ని సమర్థిస్తుంది. మేనేజిమెంటు అతడి మీద ఏ చర్యా తీసుకోకుండా చూసుకుంటుంది. మాట్లాడితే స్ట్రయిక్ అంటారక్కడ. వాళ్ళలో ఐకమత్యం చాలా ఎక్కువ అందుకే మేనేజిమెంటు వర్కర్లకి భయపడుతుంది. యూనియన్ ప్రెసిడెంట్, సెక్రటరీ మహారాజు లక్కడ. వాళ్ళు పనిచేయరు. పొద్దుటినుంచీ రాత్రివరకూ కంపెనీలోనే ఉంటారు మళ్ళీ. నాగేంద్ర చేరిన రోజునే యూనియన్‌లో మెంబరుషిప్ తీసుకున్నాడు.

యూనియన్ సెక్రటరీ ప్రసాద్ నాగేంద్ర సెక్షన్లోనే పనిచేస్తాడు. కాని నాగేంద్రతో ఎప్పుడూ మాట్లాడేవాడు కాదు. అతడికి కులంపట్టింపు చాలా ఉందనీ, తన బంధువులెవరికో రావాల్సిన ఉద్యోగం కేవలం షెడ్యూల్డు తెగలకి చెందినందువల్ల నాగేంద్రకు రావడంతో కోపం తన మీద చూపిస్తున్నాడనీ తెలిసింది నాగేంద్రకు. కాని ఆ విషయాన్నంత సీరియస్‌గా తీసుకోలేదు.

ఒకరోజు ప్రసాద్ సెక్షన్లో అందరినీ ఆహ్వానిస్తున్నాడు ఇంటికి భోజనానికి రమ్మని. అతడి కూతురు రజస్వల అయిందట ఆడవాళ్ళందరూ పేరంటానికి రావాలిట. ఈరోజుల్లో కూడా అంత చాదస్తంగా అలాంటి ఫంక్షన్లు చేయడం, అందర్నీ పిలవడం ఆశ్చర్యమనిపించింది నాగేంద్రకు. అందరికీ స్పెషల్‌గా చెపుతూ "నువ్వుకూడా రావోయ్" అని చెప్పి వెళ్ళిపోయాడు ప్రసాద్.

నాగేంద్ర వెళ్ళదలుచుకోలేదు. అతడికి ఆశ్చర్యం కలిగించిన విషయమేమిటంటే ఎప్పుడు అయిదవుతుందా, ఇంటికి పోదామా అని ఎదురుచూసే ఆడవాళ్ళు ఆ రోజు పట్టుచీరల్లో వచ్చి, ఖరీదయిన బహుమతి తీసుకుని ప్రసాద్ ఇంటికి వెళ్ళడం. మరెవరైనా ఎంత ముఖ్యమైన ఫంక్షనుకి పిలిచినా ఏదో వంక చెప్పి తప్పించుకునే వాళ్ళే వాళ్ళంతా. నాగేంద్ర తప్ప మిగతా అందరూ వెళ్ళారా ఫంక్షనుకి.

ఆ మర్నాటి నుంచీ ప్రసాద్ ధోరణి పూర్తిగా మారిపోయింది. అందరి ఎదుటా ఏదో వంకపెట్టి నాగేంద్రను తిట్టడం మొదలు పెట్టాడు. అయినా నాగేంద్ర పట్టించుకోకపోవడం మంట పుట్టించిందతడిలో.

మేనత్తకు సీరియస్‌గా ఉందని ఉత్తరం వచ్చింది. ఈ ప్రపంచంలో మిగిలిన ఏకైక బంధువామె ఒక్కతే కావడంతో నాగేంద్ర వెళ్ళి చూడాల్లని నిశ్చయించుకున్నాడు. సెక్షను ఆఫీసరు లీవు ఇవ్వనన్నాడు. నాగేంద్ర ప్రసాద్‌ని అడక్క తప్పలేదు. సినిమాకు వెళ్ళాలన్నా దెబ్బలాడి లీవు ఇప్పించే ప్రసాద్ "నువ్వింకా పర్మనెంటు కాలేదు. లీవు ఇవ్వరు" అనేశాడు నిర్లక్ష్యంగా. నాగేంద్రకు కోపం వచ్చింది. అణచుకుని మరోసారి మర్యాదగా అడిగాడు. "నేనయితే అడగను. ఏం చేసుకుంటావో చేసుకో" అన్నాడు ప్రసాద్.

అంతే అతడిచెంప పేలిపోయింది.

నాగేంద్ర మళ్ళీ ఆఫీసుకి వెళ్ళలేదు. ఊరు చేరుకునేటప్పటికి మేనత్త పోయింది. ఆవిడ అంత్యక్రియలు పూర్తిచేసి, కొండల మధ్యన పిచ్చివాడిలా తిరిగాడు. వారంరోజు లయింది, తిండి సరిగ్గాలేక నీర్సంతో ఒళ్ళు తూలసాగింది. అలాగే తిరుగుతుంటే దూరంగా పాక కనిపించింది. దాహంతో నాలుక పిడుచ కట్టుకుపోతోంది. మెల్లిగా పాకుతూ పాకవైపు జరగడం మొదలుపెట్టాడు. కాని మధ్యలోనే స్పృహ తప్పిందతడికి.

చల్లటి నీళ్ళు నోట్లో పోశారెవరో. కళ్ళు తెరిచాడు.

ఎదురుగా శంభుతాత.

**(ఇంకా వుంది)**

# వ్యాసం
## నీళ్ళసమస్య

"ప్రేమంటే యేమిటి ?"

ఆశ్చర్యంగా తలెత్తి చూసాను.

(నీమీద నా రూపు వెన్నెలలు పరచుకొని
నా కలల నీ. పెన్నెరుల అల వొక్కపరి
పొంగి
నీ కనుల నా కాంక్ష లాసజ్య ధనువులై
పొంగి

ఇటు నా బ్రతుకు కొసల నీవు
నీ బ్రతుకు మొదల నేను....)

కదిలే గుండె పేజీలను వత్తిపెట్టి, తల విదిల్చి అడిగాను.

"ఏమన్నావు ?"

"ప్రేమంటే యేమిటీ ?" సహనంగా మళ్ళీ అడిగింది.

"ప్రే.... మ" రెండు చిన్ని అక్షరాల పదం కదూ ?" అన్నాను నవ్వుతూ.

"నీ మొహంకదూ ?" నన్ను వెక్కిరిస్తూ, చికాగ్గా నా వైపు చూసింది.

"అవునా ?", తేంక్యూ. సంతోషంగా ముందుకి వంగాను. అంతమంచి కాంప్లిమెంట్ యిచ్చినందుకు ఆ మొహంమీద ముద్దయినా ప్రజెంట్ చెద్దామనే వుద్దేశంతో.

తను చాలా కోపంతో వెనక్కి జరుగుతూ-

"ఇదే ఆఖరుసారి అడగటం" అన్నట్లు చూసింది నావైపు.

"'ఇప్పుడిదేం ప్రశ్నా ?' అయినా యిదా సమయం !"

"ఏం ?... ఓహో ! చల్లని సాయంత్రం, సంధ్య ఒడిలో ఒరిగిపోయినపుడో, లేక.... తెల్లని వెన్నెల్లో విరజాజుల్ని చూస్తున్నప్పుడో తప్ప అడగకూడదా ?!"

"కావ్.... కావ్" ఎండిపోతున్న చెట్టుమీద నుంచి దాహపు గొంతుతో కాకి అరుస్తోంది.


"ఉష్ మనకే నీళ్ళులేక చస్తుంటే, ఇదోగోల కాకిగోల." కసురుకుంది కాకివైపు చేయి అదిలిస్తూ.

"దాహంతో కాదేమోనే ! దాని భాషలో ప్రేమంటే యేమిటో చెప్తున్నట్లు లేదూ ?" సరదాగా అన్నా.

లేకుంటే, గంటనుండి కుళాయి దగ్గర బిందె

సాహితీ
రంగానికి స్రవంతి
పరిచయం చేస్తున్న వినూత్న
"వ్యాస కథ"

కథ
# ప్రేమదాహం



లను చూస్తూ కూర్చున్నాం. ఎప్పుడొస్తాయో తెలియని నీటికోసం. అమృతం కోసం వేచి కూర్చున్న దేవతల్లా.

"ఇంతకూ నా ప్రశ్నకు జవాబు చెప్పలేదు నువ్వు ?"

"ప్చ్.... యేమిచెప్పనూ ? ఆ.... తెలిసింది" అన్నాను.

కుతూహలంగా ముందుకు వంగింది.

"ఇప్పుడు సడన్‌గా కుళాయిలోంచి నీళ్ళొచ్చే సమయానికో, మున్సిపాలిటీవాళ్ళకి మనమీద వుండేది 'ప్రేమ' అన్నమాట."

నవ్వేసింది తను.

"మొన్న మా ఇంటికో చుట్టపు దంపతులు వచ్చారు."

"మీ చుట్టపు దంపతులు యేమైనా కొత్త అర్థాన్ని చెప్పి వెళ్ళారా ?"

"ఆ.... అలాంటిదే."

"ఏమైంది ?"

"ఏమీలేదు. గొప్ప అమర ప్రేమికుల మనట్లు ప్రవర్తించారు."

"ఎలా ?"

వరెగ్జాంపుల్. ఏడుగంటలకి కాఫీ యిద్దా మనుకో! "అయ్యో, మావారికి ఉదయమే బెడ్ కాఫీ అలవాటే" అంటూ తెగ బాధపడిపోయింది. పాలవాడికా సంగతి తెలియదు రమా, రేపు చెప్తాలే, పోనీ నువ్వు తాగేయ్, అన్నామనుకో అమ్మో ఆయన తాగకుండానే అంటుంది. ఏదైనా టిఫిన్ పెట్టామనుకో, నాకొద్దు ఆయన దాంట్లో కొంచెము చాలు అంటూ, నేను తన కిచ్చిన ప్లేట్లోది అతనిప్లేట్లో వేసి అందులోంచి కొంచెం తీసుకుని తింటుంది.

సినిమాల ప్రభావమనిపిస్తుంది నాకైతే. భార్యాభర్తల మధ్య వుండవలసిన సున్నితమైన చర్యలు, మూడో మనిషిముందు ప్రదర్శించుకోవటాన్నే ప్రేమంటారా ? వాళ్ళనిచూస్తే నాకొచ్చిన అనుమానం. అందుకే అడుగుతున్నా నిన్ను.

"ప్రేమంటే ఏమిటి ?"

"పోనీ ఒకపని చేద్దామా ?"

"ఏమిటీ ?"

జనాల దగ్గరికిపోయి ఇంటర్వ్యూ తీసుకుందామా ?

"ఏమీఅనుకోరు. ఇందంటికి అసలు వెళ్ళక్కర్లేదు."

"పేపర్లోవేయిస్తే మనింటికే వచ్చి చెప్తారా?"

"ఊహూ.... అదీకాదు."

"మరి ?!"

"క్యూ"

"ఏవిటి ?"

"వరెగ్జాంపుల్. రేషన్‌షాప్స్‌కి వెళ్ళామనుకో రకరకాల మనుషులు. అలాగే కొళాయిలదగ్గర పెద్ద పెద్ద క్యూలు. అసలు నన్నడిగితే దేశంలో, ప్రజల జీవితమంతా యిలా క్యూలలోనే తెల్లారిపోతుందికనుక, మనం అక్కడే ఇంటర్వ్యూ చేసేయొచ్చు."

కిరసనాయిలూ, చక్కెరా, నీళ్ళు, స్త్రయికులతో జీవితం బిజీ అయిపోతే, యింకా ప్రేమా దోమా అనటానికి టైమెక్కడుంది ? పోతే.... అప్పుడప్పుడూ మీ చుట్టపుదంపతులులాంటి వాళ్ళు ఆ మాటని గుర్తుచేస్తారంతే."

ఎంతకూ రాని నీళ్ళకోసం ఎదురుచూసే ఓపిక లేక పైకిలేస్తూ....

"అవునూ ఇంతకూ ప్రేమంటే యేమిటి ?" అనుకున్నాను పంపువైపు ప్రేమగా చూస్తూ. •


– శ్రీమతి హైమ
హెచ్. ఐ. జి. ఐ
బి. జి. ఎస్/2
బాగ్‌లింగంపల్లి
హైదరాబాదు